733) దేసాళం / కాంభోజి

ప|| ఇన్ని దేహముల బుట్టి యేమిగంటిమి | వున్నతపు హరిదాస్యమొక్కటేకాక ||

చ|| హీనజంతువైననాడు యేనుగై పుట్టిననాడు | ఆనంద మొక్కటే అంగాలే వేరు |
యీనేటియజ్ఞానము యీజీవుల కొక్కలాగే | జ్ఞానమే యెక్కుడుగాక సరిలేని దొకటే ||

చ|| నరలోక భోగానకు నరకానుభవానకు | సరేగాని మిగులదు చనె దొల్లె |
గరిమ నేర్పడ నందు ఘనమేమి కొంచెమేమి | హరిదాసుడై బ్రదుకుటదియే లాభము ||

చ|| బాలుడైనయప్పుడూను పండి ముదిసినప్పుడు | కాలమొక్కటే బుద్ధి కడు లేదు |
ఆలకించి శ్రీవేంకటాధిపతి సేవించి | యేలికంటా మొక్కుచుండే దిదియే భాగ్యము ||